సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025

ఇలా.. ఇంకెన్నేళ్లు?

రాంజీగోండు సహా వెయ్యిమంది వీరులకు అధికారికంగా ఎప్పుడు నివాళులర్పిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నేడు రాంజీ సహా వెయ్యి మంది వీరుల త్యాగాల దినం..



8లో▸



సమగ్ర సర్వే పారితోషికమేది?

'సమగ్ర' సర్వే చేసిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటికీ పారితోషికం ఇవ్వ లేదు. ఐదు నెలలుగా వీరికి ఎదురుచూపులే మిగిలాయి. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0/27.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పగలు ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

వేసవి శిక్షణశిబిరానికి ఎంపిక



సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

బజార్‌హత్నూర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల క్రీడా మైదానంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం లింగన్న పర్యవేక్షణలో సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. 150 మంది పాల్గొనగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 62 మంది ఈ నెల 25నుంచి నేరడిగొండలో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, పీడీ అఖిల్, తిరుపతి, నాగరాజ్, అఖిల, షబ్బీర్, జబ్బర్‌ఖాన్, శైలజ, కిరణ్, శ్యాం, బాపురావ్, రమేశ్ పాల్గొన్నారు.

సమ్మె సక్సెస్ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఓ ప్రకటనలో కోరారు. సమ్మెకు సంబంధించి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి హాజరైనట్లు పేర్కొన్నారు. సీపీఐ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నెల్లికంటి సత్యంను నాయకులు విలాస్, గంగయ్య, రాములు, శ్రీనివాస్‌చారితో కలిసి శాలువాతో సన్మానించినట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఐటీఐలో ఏదైన ట్రేడ్‌కు సంబంధించి మూడేళ్ల అనుభవం కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్ పొందేందుకు ఈనెల 12లోపు వరంగల్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దర్జాగా ఆక్రమణలు



కొత్తగా వెలిసిన రెండు షట్టర్ల కంటైనర్

కైలాస్‌నగర్: ఉన్నతాధికారుల ఉదాసీనత, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ఆదిలాబాద్ పట్టణంలో ఆక్రమణలు ఆగడం లేదు. ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెచ్చి ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలనే కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలను ఆనుకుని నిత్యం ఎక్కడో ఓ చోట కొత్తగా ఆక్రమణలు వెలుస్తునే ఉన్నాయి. తాజాగా కలెక్టర్‌చౌక్‌లో ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయ ప్రహరీ వద్ద రెండు షట్టర్లు కలిగిన ఓ కంటైనర్‌ను దర్జాగా ఏర్పాటు చేయడం పట్టణంలో పెరుగుతున్న ఆక్రమణాలకు నిదర్శనంగా చెప్పవచ్చు. కళ్లెదుటే ఆక్రమణలు జరుగుతున్నా బల్దియా అధికారులు చోద్యం చూస్తుండటంపై సర్వత్రా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: అనాథ, నిరుపేద విద్యార్థులు పీపుల్స్ ప్రోగ్రెస్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని ప్రగతినగర్ పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్‌లో అడ్మిషన్ పొందేందుకు ఈనెల 24వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు టాలెంట్ టెస్ట్ రాయాలని తెలిపారు. 5, 6, 7 తరగతుల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94930 01171, 94903 57438 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. నాయకులు సురేశ్, సూర్యకుమార్, శ్రీనివాస్, విలాస్, శివన్న, స్వామి, గౌస్ మొయినొద్దీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పన్ను వసూలు చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

వసూలు సగమే..

- 56 శాతమే ఆస్తి పన్ను వసూలు
- వడ్డీపై రాయితీ కల్పించినా అంతే..
- గతేడాది కన్నా 15శాతం తక్కువే
- బకాయిల వసూళ్లలో వెనుకంజ
- లక్ష్యం చేరని ఆదిలాబాద్ బల్దియా

మొత్తం అసెస్‌మెంట్లు : 48,448

ఆస్తిపన్ను డిమాండ్ : రూ.13.96 కోట్లు

వసూలు చేసింది : రూ.7.80 కోట్లు

ఇంకా మిగిలింది : రూ.6.15 కోట్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీ ఆస్తిపన్ను బకాయిల వసూళ్లలో వెనుకబడింది. 2024–25 ఆర్థిక సంవత్సర వసూళ్ల గడువు గత మార్చి 31తో ముగిసింది. అయితే నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోలేదు. ప్రత్యేక బృందాలను నియమించి వసూళ్లు చేపట్టినా కిందటేడాది కంటే 15శాతం తక్కువగానే వసూలైంది. పెండింగ్ బకాయిలను రాబట్టుకునేందుకు ప్రభుత్వం వడ్డీపై 90శాతం రాయితీ కల్పించినా స్పందన అంతంత మాత్రమే వచ్చింది. పన్నులను రాబట్టుకోవడంలో బల్దియా అధికారులు విఫలమయ్యారు.

ఆస్తి పన్నే కీలకంగా మారినా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏడాదిగా బల్దియాకు ఆశించినస్థాయిలో నిధులు రావడం లేదు. దీంతో పట్టణ పరిధిలో వసూలయ్యే ఆస్తి పన్ను కీలకంగా మారింది. కానీ, పన్నులు వసూలు చేయడంలో బల్దియా యంత్రాంగం వెనుకబడిపోయింది. ఆదిలాబాద్ పట్టణ పరిధిలో 48,444 అసెస్‌మెంట్లు ఉండగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి వాటి ద్వారా రూ.13.96 కోట్లు వసూలవుతాయని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. కానీ, అందులో రూ.7.80 కోట్లు మాత్రమే వసూలు చేశారు. మరో రూ.6.15 కోట్లు బకాయిలుగానే మిగిలిపోయాయి. అదే వడ్డీపై ప్రభుత్వం 90శాతం రాయితీ కల్పించాక పన్ను డిమాండ్ రూ.11.99 కోట్లు కాగా, అందులో రూ.7. 50 కోట్లు వసూలు చేయగలిగారు. వసూళ్లు తగ్గినప్పటికీ డిమాండ్ తగ్గడంతో 8శాతం పన్నులు అదనంగా వసూలైనట్లు తెలుస్తోంది. పెండింగ్ బకాయిలు త్వరగా రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మార్చి నెలాఖరు వరకు వాటిపై విధించే వడ్డీలో 90శాతం రాయితీ కల్పించింది. కానీ, పట్టణ ప్రజలు దీన్ని అంతగా వినియోగించుకోలేదు.

కిందటేడాది కంటే తక్కువే..

2023–24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే పన్నుల వసూళ్లు భారీగా తగ్గాయి. కిందటేడాది పన్నుల మొత్తం డిమాండ్ రూ.11.72 కోట్లు ఉండగా రూ.8.42 కోట్లు వసూలు చేశారు. మరో రూ.3.3 కోట్లు మాత్రమే పెండింగ్‌లో ఉంది. కిందటేడాది కంటే రూ.62లక్షలు తక్కువగానే వసూలయ్యాయి. గతంలో 62 శాతం పన్నులు వసూళ్లు చేయగా ఈసారి 55.90శాతానికే పరిమితమైంది. ఈ ఏడాది15శాతం పన్నులు తక్కువగా వసూలయ్యాయి. పన్నుల వసూళ్ల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన సమగ్ర కుటుంబ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేపట్టింది. దీంతో రెవెన్యూ సిబ్బంది ఆ విధుల్లో నిమగ్నమవడంతో పన్నుల వసూళ్లపై ప్రభావం చూపిందనే అభిప్రాయాన్ని బల్దియా వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. మార్చి నెలాఖరులో ప్రత్యేక బృందాలు నియమించి కాలనీల్లో విస్తృతంగా తిప్పినప్పటికీ ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు కాలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, బల్దియా అధికారుల అజమాయిషీ లేక వసూళ్లలో వెనుకబడినట్లు చెబుతున్నారు.

ఎర్లీబర్డ్‌తో 5శాతం రాయితీ

ఆస్తిపన్నును ముందస్తుగా చెల్లించే ప్రజలకు ప్రభుత్వం 5శాతం రాయితీతో కూడిన ఎర్లీబర్డ్ పథకాన్ని అమలు చేస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈ నెలాఖరులోపు చెల్లించే ప్రజలకు పన్నులో ఐదు శాతం రాయితీ వర్తించనుంది. సకాలంలో పన్నులు చెల్లించినట్లయితే రాయితీ పొందడంతో పాటు వడ్డీ భారం నుంచి కూడా తప్పించుకునే అవకాశముంది.

కేంద్రం నిధులపై సందిగ్ధం

85 శాతం ఆస్తి పన్ను వసూలు చేసిన మున్సిపాలిటీలకే ఆర్థిక సంఘం నిధులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆదిలాబాద్ మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాలంటే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను డిమాండ్‌లో 85శాతం ట్యాక్స్ వసూలు చేయాల్సి ఉంది. కానీ, వడ్డీ మినహాయింపుతో కూడా ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో చతికిలపడింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వమిచ్చే ఆ నిధులు విడుదలవుతాయా.. లేదా.. అనే సందిగ్ధ పరిస్థితి నెలకొంది. అయితే ఇలాంటి పరిస్థితి రాష్ట్రంలోని అనేక మున్సిపాలిటీల్లోనూ ఉండటంతో కేంద్రం నిధుల విడుదల నిబంధనలను సవరించే అవకాశమందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కేటగిరీల వారీగా ఇలా..

మిక్స్‌డ్ కేటగిరిలో 1,484 అసెస్‌మెంట్లకు రూ.1.27కోట్ల పన్ను వసూలు లక్ష్యంగా ఉండగా రూ.కోటి వసూలైంది. ఇంకా రూ.26.32లక్షలు బకాయిలున్నాయి. నాన్‌రెసిడెన్సీ కేటగిరిలో 5,033 అసెస్‌మెంట్లకు రూ.3.73కోట్ల పన్ను వసూలు లక్ష్యం ఉండగా రూ.2.56కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.1.16కోట్లు బకాయిలున్నాయి. రెసిడెన్సీ కేటగిరిలో 41,931 అసెస్‌మెంట్లు ఉండగా రూ.8.96కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉంది. కానీ, రూ.4.73కోట్లు వసూలు కాగా, రూ.4.73కోట్లు వసూలు కావాల్సి ఉంది.

ప్రయత్నించినా వెనుకబడ్డాం



గత ఆర్థిక సంవత్సరంలో వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాం. ఆదిశగా ప్రత్యేక బృందాలను నియమించి పట్టణంలోని అన్ని వార్డుల్లో లక్ష్యాలను నిర్దేశించాం. వివిధ కారణాలతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోలేకపోయాం. కిందటేడాది సాధించిన పన్నులకు సమానంగా వసూలు చేయగలిగాం. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి బల్దియాకు ఎలాంటి ఇబ్బంది లేదు. పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలి. ఎర్లీబర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సీవీఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్

జొన్న కొనుగోళ్లు ప్రారంభిస్తాం



పంట కోతను పరిశీలిస్తున్న రాజర్షి షా

తలమడుగు: జిల్లాలో లక్ష ఎకరాల వరకు జొన్న సాగు చేశారని, త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం మండలంలోని ఖోడద్ గ్రామంలో నిర్వహించిన జొన్న పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న ఏఐ బోధన తీరును తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. తహసీల్దార్ రాజ్‌మోహన్, ఈఓపీఆర్‌డీ వెంకటరమణ, ఎంపీడీవో చంద్రశేఖర్, వ్యవసాయాధికారి ప్రమోద్‌రెడ్డి, ఎంఈవో వెంకట్‌రావు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న సత్యనారాయణరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో నిర్వహిస్తున్న పదోతరగతి వార్షిక పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈనెల 15 వరకు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. ఇప్పటివరకు 28,726 జవాబు పత్రాల స్పాట్ జరిగిందని, 1,44, 207 పత్రాల మూల్యాంకనం చేయాల్సి ఉందని తెలిపారు. పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ సోమయ్య, ఉపాధ్యాయ సంఘాల నేతలున్నారు.


పూలే జయంతికి ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని పూలే చౌక్, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆవరణలో గల పూలే విగ్రహాల వద్ద నిర్వహించనున్న మహాత్మా జ్యోతిబా పూలే జయంతికి ఏర్పాట్లు చేయాలని బీసీ, మాలీ సంఘాల నేతలు కోరారు. పూలే జయంతి నిర్వహణపై మంగళవారం జిల్లాలోని బీసీ, మాలీ సంఘాల నేతలతో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని పూలే చౌక్, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆవరణలో గల పూలే విగ్రహాల వద్ద ఏర్పాట్లు చేయాలని సూచించారు. జయంతి వేడుకలకు వచ్చేవారికి రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే వేడుకలకు హాజరయ్యే వారికి భోజనం, నీటి వసతి కల్పించాలని సూచించారు. ప్రొటోకాల్ ప్రకారం వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులకు ముందస్తు ఆహ్వాన పత్రాలు అందించాలని నాయకులు కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే, బీసీ సంఘాల నాయకులు మ్యాకల అశోక్, రవీందర్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో పన్ను చెల్లించాలి



మాట్లాడుతున్న డీటీసీ రవీందర్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: సకాలంలో త్రైమాసిక ట్యాక్స్ చెల్లించాలని, లేకుంటే వాహనదారులకు నోటీసులు జారీ చేస్తామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) రవీందర్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024 సంవత్సరానికి సంబంధించి ట్యాక్స్ లక్ష్యం 90 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. 15 ఏళ్ల దాటిన ప్రైవేట్ బస్సులను రోడ్లపై తిపవద్దని పేర్కొన్నారు. తిప్పకుండా ఉంచే వాహనాల వివరాలను ఆర్టీవో కార్యాలయంలో తెలిపితే ట్యాక్స్ మినహాయింపు ఉంటుందని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆరు నెలల్లో నిబంధనలు అతిక్రమించిన వెయ్యి ప్రైవేట్ ట్రావెల్స్‌పై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కొత్తగా వాహన సారథి పోర్టల్‌ను ప్రభుత్వం అమలు చేయనుందని తెలిపారు. గుడిహత్నూర్ సమీపంలో ఏటీఎస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మావలలోని చావర స్కూల్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు నిబంధనలకు సంబంధించి చిల్డ్రన్స్ అవగాహన పార్క్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా రవాణాశాఖ అధికారి సీపెల్లి శ్రీనివాస్, భోరజ్ చెక్‌పోస్ట్ ఇన్‌చార్జి అల్లి శ్రీనివాస్, ఎంవీఐ ప్రదీప్‌కుమార్, ఏఎంవీఐలు రవీందర్, హరీంద్రకుమార్, అపర్ణ, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షాకేంద్రాల పరిశీలన




కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆశ్రమ గురుకుల పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు గిరిజన శిక్షణ సహాయ పథకం కింద రెండేళ్ల ఇంటర్మీడియట్ (ఎంపీసీ)లో ప్రవేశం, ఉచిత ఐఐటీ, జేఈఈ శిక్షణ కోసం మంగళవారం నిర్వహించిన ఎంపిక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎమ్మార్సీ సమావేశ మందిరంలో పరీక్ష నిర్వహించారు. వేసవి కావడంతో సెంటర్ల వద్ద ఏఎన్‌ఎంలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. గిరిజన శిక్షణ సహాయ ఐఐటీ, జేఈఈ, ఎంసెట్ పరీక్షకు 586 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు 538 మంది విద్యార్థులు హాజరు కాగా, 48 మంది గైర్హాజరైనట్లు పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు.

భానుడి భగభగ

- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- సిరికొండలో 42.7 డిగ్రీలు నమోదు
- ఇళ్లకే పరిమితమవుతున్న జనాలు



ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. వారంరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. మంగళవారం జిల్లాలోని సిరికొండ మండలంలో అత్యధికంగా 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ధనోరలో 42 డిగ్రీలు, మంచిర్యాలలోని దేవులవాడలో 41.4, నిర్మల్ జిల్లాలోని తానూరులో 41.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్‌లోనే ఈ పరిస్థితి ఉంటే మే లో మరింత పెరిగే అవకాశముందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు. మధ్యాహ్నం జిల్లా కేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, తెలంగాణ, అంబేద్కర్, గాంధీచౌక్ జనం లేక వెలవెలబోతున్నాయి.

రాష్ట్రంలో జిల్లాలోనే అత్యధికం

రాష్ట్రంలోనే అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ వేడిమి తట్టుకోలేక జనాలు ఇళ్లకే పరిమితమై కూలర్లు, ఏసీలకు పనిచెబుతున్నారు. ఎండ తీవ్రతను తట్టుకునేందుకు వ్యాపారులు, ఇతర పనులకు వెళ్లేవారు శీతల పానీయాలు, కొబ్బరి బోండాలు, నిమ్మకాయ సోడా తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. జిల్లాలో భిన్న వాతావరణ పరిస్థితులుంటాయి. వానాకాలంలో ఎక్కువ వర్షాలు కురిస్తే, చలి కాలంలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోతాయి. అలాగే వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి.

అప్రమత్తత అవసరం

ఎండలో పని చేసేవారు వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తప్పనిసరిగా బయటకు వెళ్లేవారు గొడుగు, ఇతర రక్షణ కవచాలు ధరించాలని సూచిస్తున్నారు. శరీర ఉష్ణోగ్రత 106 డిగ్రీల ఫారన్‌హీట్ దాటితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని పేర్కొంటున్నారు. కళ్లు తిరగడం, తీవ్రమైన తలనొప్పి, గుండె దడ, చెమట ఎక్కువగా రావడం, ఫిట్స్ రావడం తదితర లక్షణాలు బయట పడతాయని చెబుతున్నారు. శరీరంలో ప్రొటీన్ స్థాయి తగ్గిపోయి అవయవాలు పనిచేయడం ఆగిపోతాయని, శరీర ఉష్ణోగ్రతలు మామూలు స్థితిలో ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులకు వేడిగాలి తగిలినా వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని తెలిపారు.

అల్లాడుతున్న మూగజీవాలు

ఎండ తీవ్రత కారణంగా జిల్లాలో వాగులు, చెరువులు ఎండిపోయాయి. దీంతో మూగ జీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. జిల్లాకేంద్రంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో నీటి తొట్టెలు ఉన్నప్పటికీ నిరుపయోగమయ్యాయి. పలు స్వచ్ఛంద సంస్థలు అక్కడక్కడా తొట్టెలను ఏర్పాటు చేసి నీటితో నింపుతున్నా పూర్తిస్థాయిలో మూగ జీవాల దాహం తీరడంలేదు.

జిల్లాలో వారం రోజుల ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
1.	22.2	41.3
2.	25.2	41.0
3.	21.7	37.0
4.	24.7	39.8
5.	23.7	36.3
6.	24.2	39.8
7.	24.7	41.3
8.	24.2	42.7


జాగ్రత్తలు పాటించాలి

రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి. వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. రోజుకు కనీసం 5 లీటర్ల నీటిని తాగాలి. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తాగాలి.

– నరేందర్ రాథోడ్, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్

రెవెన్యూ ఉద్యోగుల జాడేది?

- మూకుమ్మడిగా విధులకు గైర్హాజరు
- అధికారికమా.. అనధికారికంగానా?
- హాజరు రిజిస్టర్‌లో వివరాలు నిల్



బోసిపోతున్న రెవెన్యూ విభాగం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ రెవెన్యూ ఇన్‌చార్జి అధికారి, మేనేజర్ బాధ్యతలు నిర్వహించే అధికారితో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు ఆరురోజులుగా మూకుమ్మడిగా విధులకు గైర్హాజరవుతున్నారు. వీరు అధికారికంగా సెలవులో వెళ్లారా? లేదా అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నారా? తెలియడంలేదు. పన్నులు వసూలు చేసి బల్దియాకు ఆదాయం పెంచాల్సిన సమయంలో వీరు విధుల్లో లేకపోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ముందస్తుగా వసూలు చేసుకునేందుకు ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకాన్ని అమలు చేస్తోంది. పన్నులు చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తోంది. ఇంతటి కీలక సమయంలో అధికారుల్లేక రెవెన్యూ విభాగం బోసిపోతుండటం విస్మయానికి గురిచేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగి సెలవుపై వెళ్లడం వారి హక్కు.. కాదనలేం.. కానీ.. అటెండెన్స్ రిజిస్టర్‌లో ఈ నెల 2నుంచి మంగళవారం వరకు వారికి సంబంధించి వివరాలేమీ అందులో నమోదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మ్యుటేషన్లు, అసెస్‌మెంట్లు, డోర్ నంబర్ల జారీ తదితర ప్రక్రియ నిర్వహించడంలో రెవెన్యూ వ్యవస్థనే అత్యంత కీలకం. అలాంటి విభాగంలోని అధికారులు, బిల్ కలెక్టర్లు అందుబాటులో లేకుండా పోవడమేమిటనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు ఉద్యోగులంతా టూర్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును సంప్రదించగా వారంతా అధికారిక సెలవుపైనే వెళ్లారని, మిగతా సిబ్బంది వ్యవహారాలు చూస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధురాలు అదృశ్యం



పోసక్క(ఫైల్)

కోటపల్లి: మండలంలోని నాగంపేటకు చెందిన పత్తి పోసక్క (68)ఈనెల 5న భర్త పోచయ్యతో కలిసి మొక్కజొన్న చేనుకు కాపలాగా వెళ్లింది. భర్త చేను వద్దే కాపలా ఉండగా వృద్ధురాలు చీపురు పుల్లల కోసమని అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు అటవీప్రాంతంలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో పోచయ్య మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

బెట్టింగ్ ఆడుతున్న నలుగురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని సినిమా రోడ్ ప్రాంతంలో గల ట్రెండి కలెక్షన్‌లో పద్మావతి కాలనీకి చెందిన గిత్తె సూర్యకాంత్, దస్నాపూర్‌కు చెందిన పెద్వాల్ పంకజ్, శాంతినగర్‌కు చెందిన నమ్మెవార్ విశాల్, టీచర్స్ కాలనీకి చెందిన అలవత్ బాల్‌దేవ్‌ను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లతో పాటు రూ.2,210 నగదు స్వాధీనం చేసుకుని ఎస్సై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూమి విక్రయిస్తామని మోసగించిన ఆరుగురిపై..

బెల్లంపల్లిరూరల్: భూమి విక్రయిస్తామని మోసగించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన ఒంటెల రవికుమార్‌కు బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి శివారులో 6 ఎకరాల 12 గుంటల భూమి అమ్ముతామని కొందరు వ్యక్తులు చెప్పడంతో వారికి రూ.39.76 లక్షల నగదు అప్పగించాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తులు భూమిని రి జిస్ట్రేషన్ చేయకుండా మోసగించారు. దీంతో బాధితుడు సోమవారం రాత్రి తాళ్లగురి జాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో బెల్లంపల్లికి చెందిన రాగంశెట్టి సత్యనా రాయణ (సతీశ్), మల్లీశ్వరి, భీమయ్య, శ్రీ కాంత్, జగదీశ్, ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడిగుడ్ల వాహనం బోల్తా



బోల్తాపడిన మినీ వ్యాన్

నేరడిగొండ: మండలంలోని కొర్టికల్ డౌనల్ రోడ్డు ప్రాంతంలో మినీ వ్యాన్ బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే.. ఆర్మూర్ నుంచి మహారాష్ట్రలోని సార్థాని వైపు మంగళవారం కోడిగుడ్లలోడ్‌తో మినీ వ్యాన్ బయలుదేరింది. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఓ ద్విచక్ర వాహనదారుడు అడ్డురావడంతో డ్రైవర్ తప్పించబోయి ఈ ఘటన చోటు చేసుకుంది. వ్యాన్ రోడ్డుపై బోల్తా పడడంతో అందులోని కోడిగుడ్లు రోడ్డుపై పడి పగిలిపోయాయి. ఘటనలో వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ ఉమేర్‌తో పాటు మరొకరు సురక్షితంగా బయటపడ్డారు.

అత్యాచారం కేసులో నలుగురి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బాలిక(12)పై అత్యాచారం చేసిన నలుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికను ఓ వివాహిత ఆదివారం మధ్యాహ్నం సమీప అడవిలోకి తీసుకెళ్లింది. ఇద్దరు యువకులను అక్కడికి వెంటబెట్టుకోని రాగా వారు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. రాత్రి ఇంటికి తిరిగొచ్చిన బాలిక విషయాన్ని తల్లికి వివరించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు యువకులతో పాటు మహిళ, మరో మధ్యవర్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వన్యప్రాణుల మాంసం పట్టివేత?


భీమారం: చెన్నూర్ అటవీరేంజ్ పరిధిలోని భీమారం మండలం నర్సింగాపూర్‌లో అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల మాంసం స్వాధీనం చేసుకుని పలువురిని అరెస్ట్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సింగాపూర్ అటవీప్రాంతంలో ఆదివారం రాత్రి వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చి రెండు కొండె గొర్రెలను వేటాడినట్లు తెలిసింది. వాటి మాంసాన్ని విక్రయించేందుకు సోమవారం పోగులు వేస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నట్లు తెలిసింది. మాంసాన్ని స్వాధీనం చేసుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై చెన్నూర్ అటవీ రేంజ్ అధికారి శివకుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా జంతువుల మాంసం పట్టుకున్న మాట వాస్తవమేనన్నారు.

ఇలా.. ఇంకెన్నేళ్లు..!?

- వాళ్ల ప్రాణాలకూ విలువనివ్వరా?
- వెయ్యిమంది త్యాగాలకు లెక్కలేదా?
- అధికారికంగా నివాళులూ అర్పించలేరా?
- 'వెయ్యి ఉరులమర్రి' సాక్షిగా వివక్ష
- నేడు ఆ అమరవీరుల త్యాగాలదినం



తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్‌చారి గీసిన వెయ్యి ఉరులమర్రి చిత్రం



జిల్లాకేంద్రంలో రాంజీగోండు విగ్రహం

వాళ్ల పోరాటం తెలుసుకుంటే రోమాలు నిక్కబొడ్చుకుంటయ్. తమపై సాగిస్తున్న అరాచకాలను ఎదుర్కొనేందుకు.. వారు ముందుకురికిన తీరు రక్తాన్ని ఉడికిస్తుంది. చరిత్ర సైతం గోసపెట్టుకునేలా వారు చేసిన ప్రాణత్యాగాలు కళ్లను చెమరుస్తాయి. వారి వీరగాథ గుర్తుకొచ్చినప్పుడల్లా చేతులు వాటంతటవే జోడిస్తాయి. కానీ.. అలాంటి వీరుల ప్రాణత్యాగాలను ప్రభుత్వాలు చిన్నచూపు చూడటమే కలచివేస్తోందని నిర్మల్ జిల్లా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గడ్డపైనే పోరాడి, తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన రాంజీగోండు సహా వెయ్యి మంది వీరుల త్యాగాలకు ఇంకెప్పుడు అధికారిక నివాళులర్పిస్తారు..!? అన్న ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం రావడం లేదు. నేడు (ఏప్రిల్ 9) రాంజీసహా వెయ్యిమంది వీరుల త్యాగాలదినం.. – నిర్మల్

దేశ ప్రథమ స్వాతంత్య్ర సంగ్రామానికి కొనసాగింపుగా తెలంగాణ–మహారాష్ట్ర ప్రాంతంలోనూ ఉమ్మడి శత్రువులపై గోండులు, రోహిల్లాలు, మరాఠీలు, దక్కనీలు పోరు చేశారు. నిర్మల్ కేంద్రంగా 1858–60 వరకు ఈ పోరాటం సాగింది. అడవుల్లోకి చొచ్చుకొస్తూ.. ఆదివాసుల ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్న ఆంగ్లేయ, నైజాం సేనలపై జనగాం (ఆసిఫాబాద్) కేంద్రంగా చేసుకున్న గోండువీరుడు మర్సుకోల రాంజీగోండు పోరాటం ప్రారంభించాడు. నిజాం సేనలతో కలిసి నిర్మల్ కలెక్టర్ ప్రజలను పీడిస్తున్నాడని రాంజీగోండు ఈ ప్రాంతం వైపు వచ్చాడు. తాంతియాతోపే అనుచరులైన రోహిల్లా సిపాయిలు ఆయనకు తోడయ్యారు. రోహిల్లా సర్దార్ హాజీతో కలిసిన రాంజీ.. ఉమ్మడి శత్రువులైన ఆంగ్లేయ, నిజాం సేనలపై విరుచుకుపడ్డాడు. సరైన ఆయుధ సంపత్తి లేకున్నా దట్టమైన అడవులు, సహ్యాద్రి కొండలు, గోదావరి నదులను ఆసరాగా చేసుకుని వారిపై దాడులు చేసి దెబ్బతీశారు.

ఒకే మర్రికి.. వెయ్యిమంది ఉరి..

దొంగదెబ్బతో బంధించిన రాంజీ సహా వెయ్యి మందిని శత్రుసేనలు చిత్రహింసలు పెట్టాయి. ఇలాంటి వాళ్లు మళ్లీ తమపై పోరాడేందుకు కూడా సాహించకూడదని నరకం చూపించాయి. వారందరినీ నిర్మల్ శివారులోని ఎల్లపెల్లి దారిలో నేలలో ఊడలు దిగిన మర్రిచెట్టు వద్దకు ఈడ్చుకెళ్లి అందరూ చూస్తుండగా రాంజీ సహా వెయ్యి మందిని 1860 ఏప్రిల్ 9న ఉరితీశారు. దేశ స్వాతంత్య్ర చరిత్రలోనే మునుపెన్నడూ జరగని ఈ ఘటన జలియన్‌వాలాబాగ్ కంటే దాదాపు 60 ఏళ్ల ముందే చోటు చేసుకోవడం గమనార్హం. ఆ దారుణం కంటే ఇక్కడ ఎక్కువమందే ప్రాణత్యాగాలు చేసినా.. చరిత్రలో సరైన గుర్తింపు దక్కకపోవడం శోచనీయమని నిర్మల్ జిల్లా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్మల్‌గడ్డపై జరిగిన పోరుకు, వారి త్యాగాల తీరుకు తగిన గుర్తింపు తీసుకురావాలని కోరుతున్నారు.

'సాక్షి' అక్షర నివాళులు..

స్వాతంత్రం కోసం సర్వస్వం అర్పించిన సమరయోధులనూ గుర్తించాలని, రాంజీసహా వెయ్యిమంది అమరవీరుల త్యాగాలకు విలువనివ్వాలని అవకాశం దొరికినప్పుడల్లా.. 'సాక్షి' గొంతెత్తుతూనే ఉంది. వరుస కథనాలను ప్రచురిస్తూ.. ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ నాటి చరితను, వారి ఘనతను ప్రజల్లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. వెయ్యిమంది వీరుల త్యాగాలదినం సందర్భంగా బుధవారం నిర్మల్ పట్టణంలోని డాక్టర్స్‌లైన్‌లో గల డా.కావేరి లైబ్రరీలో సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.

బళ్లారి నుంచి దళం..

రాంజీసేనల దాడుల విషయం కలెక్టర్ ద్వారా హైదరాబాద్ రాజ్యంలో అప్పటి రెసిడెంట్ డేవిడ్సన్, నాటి పాలకుడు అఫ్జల్‌ఉద్దౌలా వరకు తెలిసింది. వీరి పోరును తీవ్రంగా పరిగణించిన పాలకులు అణచివేత కోసం కర్ణాటకలోని బళ్లారిలో ఉన్న 47వ నేషనల్ ఇన్‌ఫ్రాంటీని నిర్మల్ రప్పించారు. కల్నల్ రాబర్ట్ నేతృత్వంలోని ఈ దళానికీ ఇక్కడి ప్రాంతంపై పట్టులేకపోవడంతో రాంజీసేన చేతిలో దెబ్బతింది. ఈ కసితో కల్నల్ రాంజీసేనను దొంగదెబ్బ తీసి, సోన్–కూచన్‌పల్లి ప్రాంతంలో గోదావరి ఒడ్డున పట్టుకున్నాడు.

మనవంతు ప్రయత్నం..



జిల్లాలో ఎన్నో చారిత్రక కట్టడాలు ఉన్నాయి. వెయ్యి ఉరులమర్రి ఘటన ఇక్కడే చోటు చేసుకుంది. వీటిని ముందుతరాలకు అందించేందుకు మావంతు ప్రయత్నం కొనసాగుతోంది. – అభిలాష అభినవ్, కలెక్టర్

అమరధామం కోసం..



నిర్మల్‌గడ్డపై పోరాడి ప్రాణత్యాగం చేసిన రాంజీసహా వెయ్యిమంది వీరులను ప్రతీఒక్కరం స్మరించుకోవాలి. వారిత్యాగాల స్ఫూర్తిని ముందుతరాలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. నిర్మల్‌లోనూ అమరధామం ఏర్పాటు దిశగా ప్రయత్నం చేస్తున్నాం.
– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేఎల్పీనేత

వారి ఆశయాల కోసం..



రాంజీసహా వెయ్యిమంది వీరుల ఆశయాల కోసం పనిచేద్దాం. గతంలో గద్దర్, ప్రజాసంఘాలతో కలిసి నిర్మల్‌లో అమరవీరుల స్థూపం ఏర్పాటుకు కృషిచేశాం. హైదరాబాద్‌లో రాంజీ మ్యూజియం ఏర్పాటవుతోంది. నిర్మల్‌లోనూ స్మారకం ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.
– అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీమంత్రి

ప్రభుత్వానికి విన్నవిస్తాం



నిర్మల్‌గడ్డపై జరిగిన అసమాన పోరాటం, రాంజీ సహా వెయ్యి మంది అమరులకు సరైన గుర్తింపు దక్కలేదన్నది వాస్తవం. వారి ప్రాణత్యాగం ముందుతరాలకూ తెలిసేలా అందరం ప్రయత్నించాలి. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికీ విన్నవిస్తాం.
– కూచాడి శ్రీహరిరావు, డీసీసీ అధ్యక్షుడు

ఇప్పటికైనా గుర్తించాలి..



ప్రథమ భారత సంగ్రామంలోనే నిర్మల్ గడ్డ భాగమైంది. రాంజీసహా వెయ్యి మంది వీరులు మన నేలపైనే ప్రాణత్యాగం చేశారు. ఇప్పటికైనా వారి త్యాగాలకు ప్రభుత్వాలు అధికారికంగా నివాళులర్పించాలి.
– పోలీస్ భీమేశ్, రాంజీగోండు స్మారక సమితి

ప్రదర్శనకు ఎంపికైన చిత్రం



చిత్రాన్ని గీస్తున్న శ్రీనివాస్

జైపూర్: ప్రముఖ చిత్రకారుడు, శిల్పి ఏలూరి శేషబ్రహ్మం కాకతీయ శిల్ప సంపద గురించి తెలుసుకునేందుకు జనవరి 25, 26 తేదీల్లో నిర్వహించిన కాకతీయ టెంపుల్ స్కెచింగ్ స్టడీ టూర్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 60 మంది ఆర్టిస్టులు పాల్గొని పలు చిత్రాలు గీశారు. వాటిలో నుంచి ఎంపికైన చిత్రాలతో ఈ నెల 12 నుంచి 14 వరకు మాదాపూర్‌లోని తెలంగాణ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. ఇందులో మంచిర్యాల జిల్లాకు చెందిన చిత్రకారుడు చిప్పకుర్తి శ్రీనివాస్ కాకతీయ శిల్పసంపదపై గీసిన చిత్రం ప్రదర్శనకు ఎంపికైంది.

మట్కా నిందితుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అగ్ని బాబులాల్ అమాయక ప్రజలకు మట్కా చీటీలు అందజేస్తూ పట్టుబడినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తాంసి బస్టాండ్ వద్ద మట్కా చీటీలు రాస్తుండగా దాడిచేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.730 నగదుతో పాటు సెల్‌ఫోన్, మట్కా పుస్తకాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆన్‌లైన్ మట్కా నిర్వాహకుడు..

ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన మసూద్ ఖాన్ ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహణ చేస్తున్నాడు. మహారాష్ట్రలోని గుర్లాయికి సంబంధించిన సంస్థకు డబ్బులు పంపిస్తుండగా పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. నిందితుడి నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లతో పాటు రూ.5,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేసినట్లు వివరించారు.

ఇద్దరు మట్కా నిర్వాహకుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాయినాథ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని పూసాయి గ్రామ శివారులో మంగళవారం మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. మంగళవారం జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై పురుషోత్తం, ఏఎస్సై సిరాజ్ ఖాన్, కానిస్టేబుళ్లు శివాజీ, స్వామి దాడులు నిర్వహించి ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన కడదారపు గంగన్న, తాంసి మండలంలోని హస్నాపూర్‌కు చెందిన రాకేందర్‌ల నుంచి రూ.4,100 నగదుతో పాటు సెల్‌ఫోన్, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సామాన్య ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి మహారాష్ట్రలోని బోరికి చెందిన గజ్జుకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. అతనిపై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు. జైనథ్ మండలంలో మట్కా, పేకాట, దేశీదారు వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 8712659916, 8712659929 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రం శివారులోని బొమ్మరిల్లు టౌన్‌షిప్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. కాలనీలో నివాసం ఉంటున్న బొబ్బిలి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. సోమవారం రాత్రి దొంగలు ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బెడ్‌రూంలో బీరువాలో ఉన్న నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చిన శ్రీకాంత్‌రెడ్డి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రూరల్ ఎస్సై లింబాద్రి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య



దుర్గం రాము (ఫైల్)

కోటపల్లి: ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల మేరకు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన దుర్గం రాము (23) ఇంటి వద్దే ఉంటూ తండ్రితో పాటు వ్యవసాయ పనులకు వెళ్తుండేవాడు. తాను ప్రేమించిన యువతి ప్రేమకు నిరాకరించడంతో మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చెన్నూర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి బాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదిలాబాద్‌లో పశువుల వ్యాపారి...

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఫిరోజ్ సిద్దిఖి (35) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. పశువుల వ్యాపారం చేస్తున్న ఫిరోజ్ సిద్దిఖికి నష్టం రావడంతో అప్పుల బాధ తాళలేక అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేర్పించగా మంగళవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు.

మనస్తాపంతో బాలిక..

ఇచ్చోడ: మనస్తాపంతో బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల మేరకు మండలంలోని ముకురా(బి)కి చెందిన రఫీక్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంట్లో గొడవలకు దిగేవాడు. దీంతో మనస్థాపానికి గురైన అతని కుమార్తె పిర్దోసి (16) మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. మృతిరాలి తల్లి జాబినాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి ఏడాది జైలుశిక్షతో పాటు అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లించాలని స్థానిక సివిల్ కోర్టు జడ్జి కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఎస్.పారిజాత మంచిర్యాలకు చెందిన గుమ్మి జగన్నాథ్‌రెడ్డి వద్ద రూ.12లక్షలు అప్పుగా తీసుకుంది. ఒప్పందం ప్రకారం పారిజాత చెక్కులను అందజేసింది. గడువు తీరిన తర్వాత చెక్కును స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యాయి. దీంతో జగన్నాథ్‌రెడ్డి 2017లో కోర్టును ఆశ్రయించగా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సంధ్యారాణి(ఫైల్)

జైపూర్: జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన సంధ్యారాణి (40) కుటుంబసభ్యులతో కలిసి మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చింది. కారులో స్వగ్రామానికి వెళ్తుండగా ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద జైపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులను చూసి పరుగులు తీయడంతో అనుమానం వచ్చి వారిని వెంబడించగా 210 గ్రాముల గంజాయి లభించింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనంతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

యాక్సిడెంట్ కేసులో నిందితునికి జైలు

సోన్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి తొమ్మిది నెలల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ నిర్మల్ కోర్టు న్యాయమూర్తి అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. 2016లో సోన్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో గంగయ్య మృతి చెందగా అతని భార్యసంగర్వకు గాయాలయ్యాయి. ఇందుకు కారణమైన కొండ సంతోశ్‌గౌడ్‌కు న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

12 డొమెస్టిక్ సిలిండర్ల సీజ్



పట్టుబడిన సిలిండర్లు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, స్వీట్‌హౌజ్‌లలో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించి 12 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ప్రేంనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లు కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వాడాలని సూచించారు.

ప్రమాదంలో భగీరథ



బూరుగుపల్లి శివారులో మట్టి కొట్టుకుపోవడంతో బయటకు కనిపిస్తున్న భగీరథ పైపులైన్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని మాటేగాం నుంచి ఆదిలాబాద్ జిల్లాతో పాటు అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి వేసిన మిషన్ భగీరథ పైపులు మామడ మండలం బూరుగుపల్లి, మొండిగుట్ట అటవీప్రాంతంలో 44 నంబర్ జాతీయ రహదారి సమీపంలో ప్రమాదకరంగా మారాయి. గుట్ట ప్రాంతం నుంచి వచ్చిన వరదకు పైపులైన్ మట్టి కొట్టుకుపోయింది. అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ పైపులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



పై పెచ్చులు ఊడి ప్రమాదకరంగా కనిపిస్తున్న మిషన్ భగీరథ పైపులైన్



గాలిలో తేలియాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్న భారీ పైపులైన్

గుట్టుగా గంజాయి దందా..



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

ఉట్నూర్‌రూరల్: మండలంలో గంజాయి దందా గుట్టుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 2 కిలోల గంజాయి పట్టుబడింది. ఆదివారం రాత్రి రాములుగూడెంలో రైతు సాగు చేస్తున్న 20 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మంగళవారం ఉట్నూర్ ఇన్‌చార్జి ఎస్సై సునీల్ ఆధ్వర్యంలో బీర్సాయిపేటలో వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలోని లక్సెట్టిపేటకు చెందిన సట్ల గంగన్న , బీర్సాయిపేటకు చెందిన జైనేని ఎల్లయ్య అనుమానస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా 4.900 గంజాయి లభించింది. గంజాయి విలువ రూ.లక్షా 22 వేలు ఉంటుందన్నారు. వారిని విచారించగా మహారాష్ట్రకు చెందిన గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్ కరీంనగర్ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మాజీ ఎంపీపీ మంగళ సూత్రం చోరీ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడకు చెందిన బెజ్జూర్ మాజీ ఎంపీపీ రోజారమణి మంగళ సూత్రాన్ని గుర్తుతెలియని దుండగులు అపహరించారు. మంగళవారం ఉదయం ఇంటి బయట పనులు చేసుకుంటుండగా ఇద్దరు దుండగులు పూల కోసం వచ్చి ఆమె మెడలోని మంగళ సూత్రాన్ని లాక్కుని వెళ్లిపోయారు. వెంటనే బాధిత మహిళ 100 కు ఫోన్ చేయడంతో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈసందర్భంగా బాధిత మహిళ మాట్లాడుతూ రెండు రోజులుగా ఇంటి ముందు నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వాకింగ్ చేస్తున్నారని, అయితే చోరీ జరిగిన సమయంలో మాస్క్‌లు ధరించి ఉన్నారన్నారు.